
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

ఆదివారం 11 ఆగస్టు 2024





పాడేరు మండలం మోదాపల్లిలో కాఫీ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు 12 నుంచి దరఖాస్తులు

» ఐటీడీఏ పీవో వి.అభిషేక్



పాడేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులను ఇస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన 300 మంది గిరిజన అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు ఫారాలను పొందాలని, పూరించిన దరఖాస్తులను ఈనెల 17 నాటికి సమర్పించాలన్నారు. దరఖాస్తుచేసిన అభ్యర్థుల డిగ్రీ, బీఎడ్, ఇంటర్, డీఎడ్, టెట్ పరీక్షలలో పొందిన మార్కుల ఆధారంగా ఫైనల్ జాబితాను ఈనెల 20న ప్రకటిస్తామన్నారు. అలాగే మెరిట్ ఆధారంగా కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఐటీడీఏ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఎంపికైన 300 మంది అభ్యర్థులకు 75 నుంచి 90 రోజులు విశాఖపట్నం అనుభవజ్ఞులైన మాస్టర్ ట్రైనర్లతో కోచింగ్ అందిస్తామన్నారు. అలాగే కోచింగ్ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో కోరారు. మరిన్ని వివరాలకు గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఫోన్ నంబర్ 08935 250833 సంప్రదించాలని సూచించారు.

ఉద్యానవనంపై ఉదాసీనత

మన్యంలోని 760 హెక్టార్లలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళిక

» రూ.400 కోట్లతో రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు

» కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» సీఎం చంద్రబాబు ప్రకటనతో గిరి రైతుల్లో ఆశలు

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

మన్యంలో వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధికి చర్యలు చేపడితే గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందని ఐటీడీఏ అధికారులు భావించారు. అందులో భాగంగా రెండేళ్ల క్రితం అప్పటి పీవో రోణంకి గోపాలక్రిష్ణ ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు. రానున్న మూడేళ్లలో 131 మారుమూల గ్రామాల్లో పంటల అభివృద్ధికి రూ.400 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. కాని వైసీపీ పాలకులు ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేశారు.



చింతపల్లి మండలంలో రాజుపాకలు వద్ద స్ట్రాబెరీ సాగు



అల్లం సాగు చేపడుతున్న గిరి రైతు

ఏజెన్సీ ప్రాంతం వివిధ రకాల పంటల సాగుకు ఎంతో అనుకూలం. ఈ పంటల సాగును అభివృద్ధి చేస్తే గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా మిరియాలు, డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెరీ వంటివి ఏజెన్సీలో చక్కగా పండుతాయి. దీంతో ఆయా పంటల సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు గిరిజన రైతులకు ఆధునిక పద్ధతులను అలవాటు చేయడం ద్వారా దిగుబడులు రెట్టింపవుతాయి. ఫలితంగా గిరి రైతులు ఆదాయం పెరుగుతుంది. అయితే ప్రభుత్వం నుంచి గిరిజన రైతులకు ఆశించిన స్థాయిలో సాయం అందడం లేదు. అలాగే రైతులు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వందల సంఖ్యలో రైతులకు రాయితీ విత్తనాలు, అరకొరగా సబ్సిడీ యంత్రాలు అందించి, గిరిజన రైతులకు ఎంతో మేలు చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంటోంది. వాస్తవానికి గిరిజన ప్రాంతంలో సాగు నీటి వనరులను అభివృద్ధి చేయడం, రైతులకు విత్తనాలను సకాలంలో పంపిణీ, అధిక దిగుబడులకు సూచనలు, సలహాలు అందించడం, పంటల విస్తీర్ణం పెంచడం, పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే గిరిజన రైతులకు ఎంతో కొంత ప్రయోజనం ఉంటోంది. కాని ఆ దిశగా పాలకులు దృష్టిపెడుతున్న సందర్భాలు లేవు. దీంతో మన్యంలో భూమిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులు 80 శాతం మంది ఉన్నప్పటికీ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో ఆశించిన పురోగతిని సాధించలేకపోతున్నారు.

ఐటీడీఏ ప్రతిపాదనలు

భవిష్యత్తులో వ్యవసాయ, ఉద్యానవన పంటల అభివృద్ధికి రూ.400 కోట్లతో ఐటీడీఏ అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఏజెన్సీ వ్యాప్తంగా మారుమూలనున్న 131 గిరిజన పల్లెల్లో 760 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలను కొత్తగా అభివృద్ధి చేయాలని భావించారు. ప్రధానంగా 200 హెక్టార్లలో పైనాపిల్, 100 హెక్టార్లలో అల్లం, 40 హెక్టార్లలో డ్రాగన్ ఫ్రూట్, 40 హెక్టార్లలో లిచ్చి, 40 హెక్టార్లలో అవకాడో, 100 హెక్టార్లలో స్ట్రాబెర్రీ, 100 హెక్టార్లలో మిరియాలు, 40 హెక్టార్లలో బుష్ పెప్పర్, 100 హెక్టార్లలో కూరగాయలు పంటలు సాగు అభివృద్ధి చేయాలని ప్రణాళికలో పేర్కొన్నారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఏజెన్సీలో 760 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు ... మిగతా 8వ పేజీలో

కాఫీ తోటల్లో అంతర పంటల సాగు

» గిరి రైతులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచన

» మోదాపల్లి ప్రాంతంలో తోటల సందర్శన

పాడేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాఫీ తోటల్లో అంతర పంటల సాగును చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గిరిజన రైతులకు సూచించారు. శనివారం మండలంలో మోదాపల్లిలో కాఫీ తోటలను సందర్శించి, గిరిజన కాఫీ రైతులతో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కాఫీ తోటల్లో అధిక ఆదాయం లభించే సుంగధ ద్రవ్యాలైన లవంగాలు, జాజికాయ, జాపత్రి, యాలకులు వంటివి అంతర పంటలుగా వేయాలన్నారు. అలాగే కాఫీ మొక్కలకు నీడగా మామిడి, నేరేడు మొక్కలను సైతం నాటాలని సూచించారు. కేవలం కాఫీ, మిరియాలపైనే ఆధారపడకుండా అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు రైతులు కృషిచేయాలన్నారు. సుంగంధ ద్రవ్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చునన్నారు. కాఫీ తోటల పెంపకంలో ఆధునిక పద్ధతులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు.

డీజిల్ ఫల్పర్ యూనిట్‌లు కావాలని కోరిన రైతులు

తమకు డీజిల్ ఆధారంగా పనిచేసే కాఫీ ఫల్పర్ యూనిట్‌లను అందించాలని మోదాపల్లి రైతులు కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను కోరారు. కాఫీ తోటల్లో మిరియాలు సేకరణకు నిచ్చెనలు, బేబీ ఫల్పర్ యూనిట్‌లు, తమ గ్రామం నుంచి కాఫీ తోటలకు రోడ్డు సదుపాయం కల్పించాలని మోదాపల్లి కాఫీ రైతులు కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి, రైతుల అభ్యర్థన మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పైసెస్ బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ కల్యాణి, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావులను కలెక్టర్ ఆదేశించారు.


మినుములూరు సర్పంచ్‌కు అరుదైన అవకాశం

» దేశ రాజధానిలో స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



లంకెల చిట్టమ్మ

పాడేరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మినుములూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ లంకెల చిట్టెమ్మకు దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వివిధ కేటగిరిల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఐదుగురు మహిళా ప్రజాప్రతినిధులకు దేశ రాజధానిలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. వారిలో గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ కె.హెనీ క్రిస్టీనా, పశ్చిమగోదావరి జిల్లా వీరంవసరం ఎంపీపీ వీరవల్లి దుర్గా భవానీ, అల్లూరి సీతారామరాజు జిల్లా మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ, కృష్ణా జిల్లా చల్లపల్లి సర్పంచ్ పి.కృష్ణకుమారి, అనంతపురం జిల్లా జి.కల్యాణదుర్గం సర్పంచ్ బి.కవిత ఉన్నారు. అయితే ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మినుములూరుకు చెందిన గిరిజన మహిళా సర్పంచ్ చిట్టమ్మకు అరుదైన అవకాశం దక్కడంపై గిరిజన సర్పంచులు, మన్య వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బొర్రాగుహలకు వచ్చిన పర్యాటకులు

పర్యాటక సందడి

కిటకిటలాడిన బొర్రా గుహలు, చెరువులవేనం

» వరుసగా రెండు రోజులు సెలవులే కారణం



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద మంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

అనంతగిరి/చింతపల్లి, ఆగస్టు 10: మన్యానికి శనివారం పర్యాటకులు పోటెత్తారు. శని,ఆదివారాలు సెలవు దినాలు కావడంతో బొర్రా గుహలు, లంబసింగి, చెరువులవేనం తదితర పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులు క్యూ కట్టారు. అనంతగిరి మండలంలోని బొర్రా గుహలకు శనివారం 1,763 మంది గుహలను సందర్శించగా 1.39 లక్షల ఆదాయం వచ్చిందని, యూనిట్ మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. మండలంలోని తాటిగుడ, కటికి, సరియా జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో సందడి మారాయి. ప్రైవేటు వాహనాలతో ఘాట్ రోడ్డు రద్దీగా మారింది. అలాగే ఆంధ్రకశ్మీర్ లంబసింగికి సమీపంలోనున్న చెరువులవేనం ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు సీజన్‌కు ముందే క్యూ కడుతున్నారు. లంబసింగి, చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ఉదయం ఆరు గంటల నుంచి పర్యాటకుల సందడి ప్రారంభమైంది. మధ్యాహ్నం 11 గంటల వరకు లంబసింగి, చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద సందర్శకులు ఎంజాయ్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు.

దారితప్పుతున్న యువత

బెట్టింగ్, ఆన్‌లైన్‌లో పేకాట/గేమ్స్‌కు వ్యసనపరులుగా మారుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు

» తక్కువ మొత్తంతో మొదలెట్టి... వేలు, లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న వైనం

» కుటుంబ సభ్యులకు తెలియకుండా బయట అప్పులు, అవి చెల్లించలేక తిప్పలు

» అప్పుల ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేని పరిస్థితి

- 7లో

ప్రసవ వేదన ఇంకెన్నాళ్లు?

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో నిలిచిన సిజేరియన్లు

» ప్రసవం కష్టమైతే 50 కిలోమీటర్లు దూరంలోని నర్సీపట్నం వెళ్లాల్సిందే..

» స్థాయి పెరిగినా ఆదివాసీలకు అందుబాటులోకి రాని ఆధునిక వైద్యం

చింతపల్లి, ఆగస్టు 10: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ప్రసవాలు జరగకపోవడంతో గర్భిణులకు ప్రసవ వేదన తప్పడం లేదు. ఏరియా ఆస్పత్రిలో అనస్థీషియా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఏడాది కాలంగా ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు జరగడం లేదు. దీంతో ప్రసవం కష్టమైతే 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించాల్సి వస్తున్నది. కొన్ని సందర్భాల్లో అంబులెన్స్‌లో గర్భిణులు ప్రసవించడం జరుగుతోంది. తాజాగా గురువారం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి రింతాడ నుంచి వచ్చిన గర్భిణి కడుపులో శిశువు మరణించినప్పటికీ స్థానిక ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ చేసే పరిస్థితి లేక నర్సీపట్నం తరలించారు. నర్సీపట్నంలో మృత శిశువుకి జన్మనిచ్చిన ఆమెకు అధిక రక్తస్రావం కావడంతో కేజీహెచ్‌కి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించింది. అదే చింతపల్లి ఏరియా ఆస్పత్రిలోనే సిజేరియన్ చేసి వుంటే మృత శిశువు ఎక్కువ సమయం తల్లి గర్భంలో ఉండే పరిస్థితి ఉండేదికాదు. తల్లి ప్రాణాలకు ప్రమాదం తప్పేది. ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెరిగినప్పటికీ ఆదివాసీలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రాలేదు.



చికిత్స కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు



ప్రసవం కోసం వసతి గృహంలో నిరీక్షిస్తున్న గర్భిణులు(ఫైల్)

తప్పని కష్టాలు..

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో ప్రతి రోజూ ఐదు, ఆరుగురు గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. ఇక్కడి గర్భిణుల వసతి గృహంలో ప్రతి రోజు పది మంది గర్భిణులు ఉంటున్నారు. ప్రతి నెల 90కిపైగా సాధారణ ప్రసవాలు ఏరియా ఆస్పత్రిలో జరుగుతున్నాయి. కాస్త ప్రసవం కష్టమైతే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. ప్రతి నెలా 30మంది గర్భిణులను నర్సీపట్నానికి తరలిస్తున్నారు. చింతపల్లికి నర్సీపట్నం 50 కిలోమీటర్లు, పాడేరు 69 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అందువల్ల ఏరియా ఆస్పత్రిలో గర్భిణుల ప్రసవం కష్టమైతే అంబులెన్సులో నర్సీపట్నం తరలిస్తున్నారు. ఓవైపు గర్భిణి పురిటినొప్పులతో బాధపడుతూ ... మిగతా 8వ పేజీలో

అనస్థీషియా డాక్టర్ నియామకానికి చర్యలు



ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహించేందుకు అనస్థీషియాను నియమిస్తామని హెల్త్ డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఇద్దరు అనస్థీషియాల్లో ఒకరు శనివారం రాజీనామా చేశారు. అనధికారిక సెలవులోనున్న మరో అనస్థీషియాపై అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకోనున్నారు. మరో వారం రోజుల్లో అనస్థీషియాను నియమించే అవకాశం ఉన్నది.

డాక్టర్ చంద్రశేఖరరావు, సూపరింటెండెంట్

స్మార్ట్ మీటర్లు

రాష్ట్రంలో మొట్టమొదట ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏర్పాటుకు శ్రీకారం

» తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు...

» అనంతరం గృహ వినియోగదారులకు కేటాయింపు

» ఎక్కువ విద్యుత్ వాడే వారికి మాత్రమే ఏర్పాటు

» మొబైల్‌లా ముందస్తుగా రీచార్జి చేసుకోవలసి ఉంటుందన్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ విశాఖపట్నంలో మొదలైంది. తొలి మీటరును సీతమ్మధారలోని ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. వీటిని మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలకు పెడతారు. ఈపీడీసీఎల్ (తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) పరిధిలో గల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం మూడు వేల వరకూ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతానికి 500 మీటర్లు మాత్రమే రావడంతో వాటిని అమరుస్తున్నారు. ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు ఇస్తారు. వారి సంఖ్య 1.1 లక్షల వరకూ ఉంది. ఇదంతా పూర్తయ్యాక గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అందిస్తారు.



ప్రభుత్వ కార్యాలయంలో స్మార్ట్ మీటరు బిగిస్తున్న దృశ్యం

వారిలో కూడా అత్యధికంగా విద్యుత్‌ను ఉపయోగించే వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. రాయితీ విద్యుత్ వినియోగించుకునే వారికి, తక్కువ ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కె.కోటపాడు, ఆగస్టు 10: మండలంలోని ఏ.కోడూరు శివారు జంగంబంద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు గుర్తించామని ఏ.కోడూరు ఎస్‌ఐ జె.రమేష్ శనివారం తెలిపారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉండవచ్చని, శరీరం ఉబ్బిపోవడంతో గుర్తు పట్టని విధంగా ఉన్నట్టు చెప్పారు. తెలుపు, నలుపు రంగుల అడ్డగీతలతో ఉన్న టీ షర్టు, జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆ వ్యక్తి సంబంధీకులు ఉంటే ఏ.కోడూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

102 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురి అరెస్టు
- రెండు వాహనాలు సీజ్


పట్టుబడిన గంజాయి, నిందితులతో అదనపు ఎస్పీ జగదీశ్ హడహళ్లి

చింతపల్లి, ఆగస్టు 10: ఒడిశా నుంచి కాకినాడకు గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీశ్ హడహళ్లి తెలిపారు. నిందితుల నుంచి 102 కిలోల గంజాయి, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం అన్నవరం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిశా చిత్రకొండ బ్లాక్ పొదం జాలా గ్రామంలో జి.మాడుగుల మండలం ఏడుచావళ్ల గ్రామానికి చెందిన మర్రి శివరావు, చింతపల్లి మండలం లోతుగెడ్డ గ్రామ పంచాయతీకి చెందిన చిక్కం ప్రసాద్, బందబయలు గ్రామానికి చెందిన కుందేటి నాగేశ్వరరావు, చెరుకుంపాకలు గ్రామానికి చెందిన ఏళ్లెటి అర్జున్, దోమలగొంది గ్రామానికి చెందిన కొప్పోజి శ్రీనుబాబులు గంజాయిని కొనుగోలు చేశారన్నారు. గంజాయిని ప్యాకింగ్ చేసుకుని రాళ్లగెడ్డ మార్గంలో కాకినాడ తరలించేందుకు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం ఒకరు ద్విచక్రవాహనంలో పైలెట్‌గా ముందుగా ప్రయాణిస్తుండగా వెనుక ఆటోలో గంజాయిని తరలిస్తున్నారన్నారు. అన్నవరం పోలీసులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు లోతుగెడ్డ బ్రిడ్జి వద్ద ఉదయం నుంచి ఎస్‌ఐ రాజారావు, పోలీసులు వాహన తనిఖీలు ప్రారంభించారని చెప్పారు. మధ్యాహ్నం 11 గంటలకు ఓ ద్విచక్రవాహనం, ఆటో లోతుగెడ్డ బ్రిడ్జి వద్దకు వచ్చి పోలీసులను గమనించి వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు అప్రమత్తమైన పట్టుకున్నారన్నారు. ఆటోను తనిఖీ చేయగా 102 కిలోల గంజాయి బయటపడిందని, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి గంజాయి, ద్విచక్రవాహనం, ఆటో, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్, ఎస్‌ఐ రాజారావు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

చింతపల్లి, ఆగస్టు 10: మండలంలో మూడు కిలోల గంజాయితో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ ఎం. వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కృష్ణా జిల్లా పెనుమలూరు గ్రామానికి చెందిన తిరుమలకొండ నరసింహరావు, గల్లా రామేశ్, వేముల బాలు ఒక బ్యాగ్‌లో గంజాయి తరలిస్తూ వాహన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు.

గోవులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

- 52 పశువులు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు


కంటెయినర్‌లో తరలిస్తున్న గోవులు

ఎలమంచిలి, ఆగస్టు 10: స్థానిక జాతీయ రహదారిపై శనివారం ఉదయం గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నామని, ఈ సందర్భంగా ముగ్గురిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి తెలిపారు. విజయనగరం జిల్లా మానాపురం సంత నుంచి 52 ఎద్దులను కొనుగోలు చేసి, కంటెయినర్‌లో కేరళలోని పాలక్కాడ్ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన చొప్పా నూకరాజు, కేరళ రాష్ట్రానికి చెందిన షిజు, విష్ణులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సావిత్రి తెలిపారు. పట్టుబడిన ఎద్దులను వెటర్నరీ వైద్యుల పరీక్షలు అనంతరం సంరక్షణ ప్రాంతానికి తరలించనున్నట్టు ఆమె తెలిపారు.

'నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలి'

రోలుగుంట, ఆగస్టు 10: ఏజెన్సీని ఆనుకొని రోలుగుంట మండలంలోని పలు నాన్-షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజన సంఘం 5వ సాధన కమిటీ నాయకుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొరుప్రోలులో గిరిజనులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఆదివాసీ కొండదొర, నూకదొర, భగత, గదబ, మన్నె దొర తదితర తెగలు ఉన్నారన్నారు. ఏజెన్సీ ఆచారాలు, సంప్రదాయాలను ఆచరిస్తున్నారన్నారు. వీరికి 5వ షెడ్యూల్‌లో పొందుపరిచిన గిరిజన చట్టాలు, ఐటీడీఏ పథకాలు అందడం లేదన్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు కూడా అందించినట్లు తెలిపారు.

విశాఖ, బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్ల పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 10: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ, బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను మరో 15 ట్రిప్పుల వరకు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 08543 నంబరు గల రైలు ఈనెల 18 నుంచి సెప్టెంబరు 24 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.30 గంటలకు ఎంఎస్‌ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08544 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి సెప్టెంబరు 25 వరకు మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టాయ్, కుప్పం, బంగారపేట, కృష్ణరాజపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలాస, బ్రహ్మపూర్ రైళ్లు శ్రీకాకుళం రోడ్డు వరకే...

వాల్తేరు డివిజన్ పరిధిలోని పలాస, పూండి, నౌపడ, విజయనగరం సెక్షన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపట్టనున్నందున విశాఖ, పలాస మధ్య నడుస్తున్న మెము పాసింజర్ రైళ్లతోపాటు విశాఖ, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు సాగించే రైళ్ల గమ్యాలను శ్రీకాకుళం రోడ్డు వరకు కుదించామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా 07470, 07471 మెము రైళ్లు ఈనెల 12, 15, 17వ తేదీల్లో విశాఖ, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య, రాకపోకలు సాగిస్తాయన్నారు. శ్రీకాకుళం, పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేసినట్టు పేర్కొన్నారు. అలాగే, 08532 నంబరు గల రైలు ఈనెల 11న విశాఖ నుంచి శ్రీకాకుళం వరకు, 08531 నంబరు గల రైలు ఈనెల 12న శ్రీకాకుళం రోడ్డు నుంచి విశాఖకు నడుస్తుందని తెలిపారు. ఈ రైళ్లు శ్రీకాకుళం రోడ్డు, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు సాగించవని పేర్కొన్నారు. ఈ నెల 15న భువనేశ్వర్- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830), ఈనెల 17న భువనేశ్వర్ - తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879) రైళ్లు భువనేశ్వర్‌లో గంట ఆలస్యంగా బయలుదేరేలా రైళ్ల రీ షెడ్యూల్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

దారితప్పుతున్న యువత



బెట్టింగ్, ఆన్‌లైన్‌లో పేకాట/గేమ్స్‌కు వ్యసనపరులుగా మారుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు

- తక్కువ మొత్తంతో మొదలెట్టి...
- వేలు, లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న వైనం
- కుటుంబ సభ్యులకు తెలియకుండా బయట అప్పులు, అవి చెల్లించలేక తిప్పలు
- అప్పుల ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేని పరిస్థితి
- ఆలస్యంగా గుర్తిస్తున్న తల్లిదండ్రులు
- పిల్లల నడవడిక, ఖర్చులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచిస్తున్న మానసిక వైద్యులు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి):

విశాఖలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బీటెక్ చదువుతున్నాడు. కొద్దిరోజులుగా ముభావంగా ఉండడంతోపాటు ఇంట్లో వాళ్లను తరచూ డబ్బులు అడగడం మొదలెట్టాడు. ఎందుకని అడిగితే సమాధానం చెప్పడం లేదు. గట్టిగా నిలదీస్తే చనిపోతానంటూ బెదిరించసాగాడు. తల్లిదండ్రులకు విషయం ఏమిటో అర్థం కాక మానసిక వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. సదరు వైద్యుడు కౌన్సెలింగ్ నిర్వహించి మెల్లగా విషయాన్ని రాబట్టారు. తల్లిదండ్రులకు తెలియకుండా నాలుగు లక్షలు రూపాయలు అప్పు చేసి, ఆన్‌లైన్ పేకాటలో పోగొట్టినట్టు చెప్పాడు.

విజయనగరం జిల్లాకు చెందిన యువకుడు విశాఖలోని ఒక ప్రైవేటు వసతి గృహంలో ఉంటూ బీబీఏ చదువుతున్నాడు. కొద్దిరోజుల కిందట తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.5 లక్షలు అర్జంట్‌గా కావాలని అడిగాడు. ఎందుకంటే సమాధానం చెప్పలేదు. డబ్బు పంపిస్తేనే మీకు కనిపిస్తానని హెచ్చరించడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే విశాఖకు చేరుకున్నారు. కుమారుడు ఆందోళనగా ఉన్నట్టు గుర్తించి మానసిక వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. అతడితో వైద్యుడు మాట్లాడగా బెట్టింగ్‌లో ఏడు లక్షల వరకు నష్టపోయినట్టు తెలిపాడు.

దేశ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యువకులు అడ్డదారులు తొక్కుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ వంటివి ఆడుతూ లక్షలాది రూపాయలను నష్టపోతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు డ్రగ్స్, మద్యం వంటి అలవాట్లకు బానిసలుగా మారుతూ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈ తరహా యువకుల సంఖ్య గత కొన్నాళ్లుగా పెరుగుతోంది. చెడు స్నేహాలు, అలవాట్లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వారిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ ఉండడం గమనార్హం. నగర, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా చిన్న వయసులోనే బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొదట తక్కువ మొత్తంతో ప్రారంభిస్తున్నారు. ఆ మొత్తాన్ని రాబట్టుకునే ప్రయత్నంలో వేలు, లక్షలు పోగొట్టుకుంటున్నారు. అందుకోసం దొరికిన చోటల్లా అప్పులు చేస్తున్నారు.

నిరుద్యోగి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకు

ఈ జాబితాలో ప్రధానంగా విద్యార్థులు, నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉంటున్నారు. నగర పరిధి ఎంవీపీ కాలనీ ప్రాంతానికి చెందిన ఒక యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ పని చేస్తున్న ఒక స్నేహితుడి ద్వారా ట్రేడింగ్ చేయడం ప్రారంభించాడు. తొలుత లాభాలు రావడంతో ఎక్కువ మొత్తాన్ని పెట్టుబడి పెట్టాడు. పది రోజుల వ్యవధిలోనే సుమారు రూ.20 లక్షల వరకూ నష్టపోయాడు. క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ యాప్‌లలో అప్పులు తీసుకుని మరీ పెట్టుబడి పెట్టిన సదరు యువకుడు...సమయానికి ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించక పోవడంతో వేధింపులు పెరిగాయి. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పలేక ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. సకాలంలో స్నేహితులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. తల్లిదండ్రులు అక్కడి నుంచి తీసుకు వచ్చేశారు. అప్పులు చెల్లించి జాగ్రత్తగా ఉండాలని సూచించడంతోపాటు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. విశాకలోని ప్రైవేటు కంపెనీలో పనిచేసే శ్రీకాకుళం జిల్లా యువకుడు రోజూ ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతుండేవాడు. ఈ క్రమంలో అప్పుల పాలయ్యాడు. విషయం సోదరుడికి తెలియడంతో వచ్చి ఇంటికి తీసుకువెళ్లిపోయారు. అప్పటికే మూడు లక్షల రూపాయలు అప్పు చేసినట్టు తేలింది. దీంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి మరీ ఆ అప్పులు తీర్చారు.

పాన్‌కార్డ్, ఆధార్ కార్డుతో అప్పులు

అప్పులు ఇచ్చేందుకు అనేక రకాల యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. పాన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ ఉంటే చాలు అప్పులు ఇస్తున్నారు. అయితే, భారీమొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారు. ఈ తరహా యాప్‌లు, కొందరు అప్పులు క్లియర్ చేసినా వారిని వేధింపులకు గురి చేస్తున్నాయి. ఇదిలావుండగా సులభంగా అప్పులు దొరుకుతుండడంతో ఇంట్లో తెలియకుండానే చాలామంది ఈ తరహా దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. ఈ అప్పులు భవిష్యత్తులో వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్న విషయాన్ని గ్రహించడం లేదు.

ఆర్థిక అవసరాలపై దృష్టి అవసరం

పిల్లల ఖర్చుపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. అప్పుడే ఈ తరహా వ్యసనాలకు ప్రాథమిక దశలోనే అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. ఖరీదైన వస్తువులు కొనుగోలు చేయడం, ఇంట్లో అవసరాలను తీర్చే పనులు చేయడం, ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు అడగకపోవడం, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బులు అడగడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, ఒంటరిగా ఉండేందుకు యత్నించడం వంటివి చేస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. కొన్నిసార్లు బంధువులు వద్ద కూడా అప్పులు చేస్తుంటారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే వేగంగా వాటి నుంచి దూరంగా ఉండేలా చేయవచ్చునని చెబుతున్నారు. ఆలస్యం అయితే ఆర్థికంగా తీవ్రస్థాయిలో నష్టపోవడంతోపాటు కొన్నిసార్లు పిల్లల ప్రాణాలు కోల్పోవచ్చునని చెబుతున్నారు.

పిల్లల ఆర్థిక అవసరాలను నిశితంగా గమనించాలి

గతంతో పోలిస్తే పిల్లలు వ్యవహారశైలిలో పూర్తిగా మార్పు వచ్చింది. కుటుంబ పరిస్థితి, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆడంబరాలకు పోతున్నారు. అదే ప్రమాదానికి హేతువుగా మారుతోంది. పెద్దింటి పిల్లలతో సమానంగా బతకాలనే ఆలోచనలో నుంచి పుట్టుకు వస్తున్నవే ఈ తరహా దురలవాట్లు. ఎవరో ఆడుతున్నారని వీళ్లు నేర్చుకుంటున్నారు. డబ్బులు లేకపోతే అప్పులు చేస్తున్నారు. కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు కూడా పిల్లలు ఆనందంగా ఉండాలని ఆర్థిక పరి స్థితులకు మించి వారి అవసరాలను తీరుస్తున్నారు. వేలాది రూపాయల ఫోన్లు, బైక్‌లు కొనిస్తున్నారు. ఇవి దురలవాట్ల వైపు పిల్లలు మొగ్గేలా చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ అవసరాలకు డబ్బులు ఇవ్వకపోతే కొందరు పిల్లలు అప్పులు, రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల కిందట హైవేపై దొంగతనాలకు పాల్పడుతున్న 15 మందిని పట్టుకున్నారు. వీరంతా చదువుకుంటున్నవాళ్లే. దొంగతనాలు చేయడానికి కారణాలు తెలుసుకుంటే ఆన్‌లైన్ గేమ్స్, ఖరీదైన బైక్స్ మెయింటెనెన్స్ కోసం అని చెప్పారు. ఇటువంటి వ్యవహారాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు మోరల్ వాల్యూస్ చెప్పాలి. ఆర్థిక స్థితిగతులు, తమ కుటుంబ పరిస్థితులు వివరించాలి. మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లు వల్ల కలిగే అనర్థాలను చిన్న వయసులోనే తెలియజేయాలి. - **ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు,** ఏయూ సైకాలజీ విభాగాధిపతి

ఎమ్మెల్సీపై తేల్చని కూటమి

- నేడు లేదా రేపు ఆరుగురు సభ్యుల కమిటీ సమావేశం
- వైసీపీ అభ్యర్థి బొత్స నామినేషన్ రేపు
- ఓటు కోసం వైసీపీ ఎంపీ, ఎమ్మెల్సీల దరఖాస్తు

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల్లో పోటీ/అభ్యర్థి ఎంపికపై కూటమి నేతలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. ఈ విషయమై ముఖ్యమంత్రి నియమించిన ఆరుగురి సభ్యుల కమిటీ శనివారం విజయవాడలో భేటీ కావల్సి ఉంది. అయితే సభ్యుల్లో ఇద్దరు, ముగ్గురు అందుబాటులో లేకపోవడంతో ఆదివారం లేదా సోమవారం సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఇదిలావుండగా వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదేరోజు మైదాన ప్రాంతానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను క్యాంపునకు తీసుకువెళతారని చెబుతున్నారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 13వ తేదీతో గడువు ముగుస్తోంది. అందువల్ల కూటమి పోటీ చేయదలచుకుంటే అభ్యర్థి పేరును సోమ, మంగళవారాల్లో ఖరారు చేయాల్సి ఉంటుంది. కాగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి విడుదల చేసిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, కొత్త ఓటర్ల చేరికలకు గడువు ముగిసింది. చివరిరోజు వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణిలు ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేశారు.

పరిహారం, ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలి

- కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్


చందనాడలో విలేకరులతో మాట్లాడుతున్న కారిడార్ రైతులు

నక్కపల్లి, ఆగస్టు 10: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన తమకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని నిర్వాసిత రైతులు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని చందనాడ తుఫాన్ భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారిడార్ కోసం భూసేకరణ చేసిన సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోతున్నవారికి, 18 ఏళ్లు వయసు నిండిన వారికి రూ 25 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. దళితుల గుల్లబట్టీలు, డి.పట్టా భూములను సాగుచేసుకున్న వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం ఫిషింగ్ జెట్టీ నిర్మించాలన్నారు. రైతులకు వైసీపీ నేత వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, సర్పంచ్ తళ్లా రోహిణి భార్గవ్ సంఘీభావం ప్రకటించారు.

'ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలి'

- ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు

నర్సీపట్నం, ఆగస్టు 10 : ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ, డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. పెన్షన్‌దారులకు నగదు రహిత వైద్యం ఈహెచ్‌ఎస్‌పై అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ తాలూకా ముఖ్య కేంద్రంలో పెన్షనర్స్ అసోసియేషన్‌కి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్రే గజ్జాలమ్మ, డీడీ ప్రసాదరావు, పి.కృష్ణమూర్తి, ఎం. అప్పలనాయుడు, సీహెచ్ సోమేశ్వరరావు, ఎస్‌బీఐ మేనేజర్ జేవీ రాఘవరావు పాల్గొన్నారు.

ఏయూ మాజీ ఓఎస్‌డీ సిత్రాలు

- రాజీనామా చేసినా ఇప్పటికీ అదే హోదాలో కాన్ఫరెన్స్‌లకు వెళుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్
- గత నెలలో శ్రీలంక సదస్సుకు హాజరు
- ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకాక్‌లో జరిగే కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ఇప్పటికీ వర్సిటీకి చెందిన ఉన్నతాధికారిగానే పలు కాన్ఫరెన్స్‌లకు హాజరవుతుండడం చర్చనీయాంశంగా మారింది. గత నెలాఖరులో శ్రీలంకలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌కు ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) హోదాలో హాజరైన కృష్ణమోహన్...ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న మరో కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. సదరు కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ఆహ్వానపత్రంలో ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను ఓఎస్‌డీగానే పేర్కొనడం గమనార్హం. దీనిపై వర్సిటీ ఉన్నతాధికారులను వివరణ కోరగా...ఆయన ఓఎస్‌డీ పదవికి రాజీనామా చేశారని, అవి ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న సదస్సులు కావచ్చునని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రొఫెసర్ వడ్డాది కృష్ణమోహన్ మూడు పర్యాయాలు ఏయూ రిజిస్ట్రార్‌గా కొనసాగారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు గత వీసీ రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అవకాశాన్ని కల్పించారు. రిజిస్ట్రార్ బాధ్యతలు నుంచి తప్పుకున్న తరువాత ఓఎస్‌డీ పేరుతో ప్రత్యేకంగా పోస్టును సృష్టించి ఆయన్ను నియమించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జూన్ నెలాఖరులో వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ పదవులకు ప్రసాదరెడ్డి, జేమ్స్ స్టీఫెన్, కృష్ణమోహన్ రాజీనామా చేశారు. అయితే, అంతర్జాతీయంగా పలు దేశాల్లో జరుగుతున్న కాన్ఫరెన్స్‌లకు మాత్రం కృష్ణమోహన్ ఇప్పటికీ ఓఎస్‌డీ హోదాలోనే హాజరవుతుండడంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు



సమావేశంలో పాల్గొన్న పెంటారావు

కొత్తూరు, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకొని రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని మాల మహానాడు రాష్ట్ర అధ్య క్షుడు పాల్తేటి పెంటారావు అన్నారు. శనివారం అనకాపల్లి పట్టణంలోని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జిల్లా స్థాయి ప్రతినిధులు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంతం.. మాలల పంతం నినాదంతో ముందుకు వెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని, అవసరమైతే వర్గీకరణపై ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అంబేడ్కర్ ఇండియన్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి టీటీ.అప్పారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.దేవుడు, గొంది అప్పారావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు బోగేష్, కన్వీనర్ శివ, కో-కన్వీనర్లు ప్రకాష్, శేఖర్, రెల్లి శ్రీను, నూకేష్ తదితరులు పాల్గొన్నారు.



మోదకొండమ్మను దర్శించుకుంటున్న విజయనగరం జిల్లా అదనపు జడ్జి దుర్గయ్య

మోదకొండమ్మను దర్శించుకున్న విజయనగరం జిల్లా అదనపు జడ్జి

పాడేరు రూరల్, ఆగస్టు 10: పాడేరు మోదకొండమ్మను విజయనగరం అదనపు జిల్లా జడ్జి జి.దుర్గయ్య కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు తీర్చుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, సభ్యులు తమర్బ ప్రసాద్‌నాయుడు, స్థానిక ప్రథమ శ్రేణి జుడిషియల్ కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ప్రతీ గృహంలో జాతీయ జెండా ఎగరాలి

▸▸ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

చింతపల్లి, ఆగస్టు 10: గిరిజన ప్రాంతంలో ఈ నెల 13న ప్రతి గృహంలోనూ జాతీయ జెండాను ఎగురవేయాలని గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సాగిన బాలక్రిష్ణ అధ్యక్షతన చింతపల్లిలో శనివారం జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిషత్ కార్యదర్శులు ప్రతీ కుటుంబానికి జాతీయ జెండాలను అందజేస్తారన్నారు. 14న పార్టీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ చేపట్టాలన్నారు. 15న స్వాతంత్ర్య వేడుకను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూడా కృష్ణారావు, కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు, ఏబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు మోహన్, గిరిజన మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, కదుళ్ల శ్రీనివాసరావు, పార్టీ నేత వసుపరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వర్కర్ పోస్టులు భర్తీ చేయాలని ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరు రూరల్, ఆగస్టు 10: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయం ప్రధాన గేటు వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్ర మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ కళాశాల వసతి గృహాల్లో వర్కర్లను శాంక్షన్ పోస్టుల ద్వారా భర్తీ చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి విద్యార్థులకు వచ్చే మెస్ చార్జీల నుంచి రూ.53 చొప్పున కట్ చేసి వర్కర్లకు ప్రతీ నెల వసతి గృహ నిర్వాహకులు వేతనాలు ఇస్తున్నారన్నారు. ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు పూర్తి భిన్నంగా గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో మెనూ అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వర్కర్స్ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వమే వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు మస్తాన్, నాగభూషన్, కె.రాజశేఖర్, బాబ్జీ, చిన్నబాబు, దేవదాస్ పాల్గొన్నారు.

తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుని దృష్టికి మన్యం సమస్యలు



చిన్నబాబును సత్కరిస్తున్న మన్యం నేతలు

పాడేరు రూరల్, ఆగస్టు 10: అరకు పర్యటనకు శనివారం వచ్చిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబును స్థానిక నాయకుడు కలిసి మన్యం సమస్యలు తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పాడేరు, అరకు నియోజకవర్గాల నాయకులు అతన్ని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మన్యంలోని యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జీవో నంబర్ 3ను పునరుద్ధరించి గిరిజన యువతకు శతశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరగా, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు వెంకట సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొంతెలి వెంకటప్రసాద్, కృష్ణ, సాయిరాం, అమ్మన్న, బాలు పాల్గొన్నారు.

యర్రవరం-సమగిరి మార్గం.. బురదమయం



బురద పట్టిన రహదారి... వాహన చోదకుడి పాట్లు

చింతపల్లి, ఆగస్టు 10: గొందిపాకలు పంచాయతీ సమగిరి-యర్రవరం రహదారి బురదమయమైంది దీంతో వాహన చోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం టూరిజం ప్రాజెక్టులో భాగంగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ రహదారికి ఇరువైపులా కాలువలు తవ్వి గ్రావెల్ వేసి వదిలేశారు. దీంతో వర్షం కురిస్తే రోడ్డు బురదమయమై దమ్ము పట్టిన పొలాన్ని తలపిస్తున్నది. ఫలితంగా వాహనాల చక్రాలు బురదలో కూరుకునిముందుకు కదలడం లేదు. దీంతో ద్విచక్ర వాహనాలు, జీపులు, ఆటోల్లో రాకపోకలు సాగి స్తున్న చోదకులు, ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారిని బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఉద్యానవనంపై ఉదాసీనత!

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వానికి ఐటీడీఏ అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితం నుంచి ఈ ప్రతిపాద నలకు అతీగతీ లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎప్పుడు గ్రీన్‌సిగ్నల్ వస్తుందా అని ఐటీడీఏ అధికారులు ఎదురు చూస్తున్నారు. ఏజెన్సీలో వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధి, గిరి రైతులకు జగన్ ప్రభుత్వానికి ఏపాటి శ్రద్ధ ఉన్నదో ఇట్టే స్పష్టమవుతున్నది. అయితే ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం వచ్చింది. తాజాగా అమరావతిలో జరిగిన 'ఆదివాసీ దినోత్సవాల్లో' ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివాసీల జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, పేదరికం నుంచి వారిని విముక్తి చేస్తామని ప్రకటించారు. దీంతో తమ కోసం కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందనే ఆశాభావం ఆదివాసీల్లో వ్యక్తమవుతున్నది.

సుందర భవనం.. నిరుపయోగం!

▸▸ మహిళా డిగ్రీ కళాశాల భవన ప్రారంభోత్సవంలో జాప్యం

▸▸ వసతిగృహ భవనం పూర్తికాకపోవడమే కారణం

▸▸ విద్యార్థులు, అధ్యాపకులకు తప్పని ఇబ్బందులు

కళ్లెదురుగా దగదగా మెరిసిపోతున్న భవనం.. అన్ని సదుపాయాలతో కూడిన నూతన సముదాయం.. పనులన్నీ పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం.. దీంతో పరాయి పంచన కళాశాల కొనసాగిస్తున్న దైన్యం.. ఫలితంగా ఇబ్బందుల నడుమ తరగతులు నిర్వహించుకోవాల్సిన దౌర్భాగ్యం.. ఇదీ అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకుల దుస్థితి.



కొనసాగుతున్న వసతిగృహం భవన నిర్మాణ పనులు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మహిళా డిగ్రీ కళాశాల భవనం

అరకులోయ, ఆగస్టు 10:

ఈ కళాశాలకు నూతన భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూసా పథకం నుంచి రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఐదేళ్ల నుంచి భవన నిర్మాణాలు కొనసా....గాయి. ఎట్టకేలకు నెల రోజుల క్రితం కళాశాల పరిపాలనా బ్లాక్ పూర్తిచేసి ప్రిన్సిపాల్‌కు కాంట్రాక్టర్ అప్పగించారు. కళాశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలతో అధునాతన భవనం సిద్ధమైందని, ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న భవన సమస్యకు చెక్ పడిందని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఎంతో సంబరపడ్డారు. ఈ భవనం ఎప్పుడు ప్రారంభిస్తారా..? కొత్త భవనంలోకి ఎప్పుడు అడుగు పెడదామా..? అని ఎంతో ఆశతో విద్యార్థినులు, అధ్యాపకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో భవన ప్రారంభోత్సవానికి జాప్యం జరుగుతుండడంతో వారంతా నిరాశ చెందుతున్నారు.

వసతిగృహ భవనం పూర్తికాకపోవడంతోనే!

మహిళా డిగ్రీ కళాశాలకు ఆనుకుని విద్యార్థినులకు వసతిగృహ భవన నిర్మాణపు పనులు కొనసాగుతున్నాయి. వసతిగృహం భవనం పూర్తిచేస్తే ఒకేమారు పూర్తిగా నూతన భవనంలోకి తరగతులను మార్చాలని సంబంధిత అధికారులు, నిర్వాహకులు యోచిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని సదుపాయాలతో భవనం సిద్ధమైనా, వసతిగృహ భవనం పూర్తి కాకపోవడంతో ప్రారంభోత్సవంలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. దీంతో గత్యంతరం లేక ప్రస్తుతం మహిళా డిగ్రీ కళాశాలను కోఎడ్యుకేషన్ కళాశాల భవనంలోనే కొనసాగిస్తున్నారు. కో-ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులకు భవన సమస్య ఉండగా, మహిళా డిగ్రీ కళాశాలను సైతం ఇదే కళాశాలలో నిర్వహిస్తుండడంతో ఇరు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మహిళా కళాశాలకు పూర్తిస్థాయి అధ్యాపకులను కూడా నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మరో అధ్యాపకులు తప్పితే మిగిలిన వారంతా అవుట్‌సోర్సింగ్ విధానంలోనే పనిచేస్తున్నారు.

సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభిస్తాం..

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతులను నూతనంగా సమకూరుతున్న కళాశాల భవనంలో నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ స్పష్టం చేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో కళాశాల వసతిగృహ భవ నిర్మాణం పూర్తిచేసి అప్పగించనున్నట్టు అధికారులు తెలిపారని, వారు అప్పగించిన వెంటనే మహిళా కళాశాల, వసతిగృహాల నూతన భవనాలను ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

కొయ్యూరు పోస్టుమెట్రిక్ హాస్టల్ భవనానిదీ అదే దారి..!



నిరుపయోగంగా దర్శనమిస్తున్న పోస్టుమెట్రిక్ వసతి గృహ భవనం

కొయ్యూరు: లక్షలాది రూపాయ వెచ్చించి అన్ని వసతులతో కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలకు అనుసంధానంగా నిర్మించిన బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్ భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఇది చీకటి కార్యకలాపాలకు నిలయమైంది. మండలంలో బాలికలు పదో తరగతి అనంతరం పైచదువులు చదివేందుకు అవకాశం లేకపోవటంతో కాకరపాడు గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో గ్రూపునకు 10 వంతున ప్రతీ విద్యా సంవత్సరంలో 60 మంది విద్యార్థినులకు కళాశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. వారికి వసతి కోసం కాకరపాడు పెట్రోల్‌బంక్ వెనుక అన్ని సదుపాయాలతో కూడిన పోస్టు మెట్రిక్ వసతిగృహ భవనం నిర్మించారు. 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణాలకు రూ.1.6 కోట్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తిచేశారు. అప్పటి వరకు స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలోని రెండు గదులలో నిర్వహిస్తున్న పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు వసతి సమస్య తీరింది. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల పాటు ఈ వసతి గృహ భవనాన్ని నిర్వహించి అనంతరం, కాకరపాడు గురుకుల కళాశాలలో బాలికలకు ప్రవేశం కల్పించేందుకు అనుమతులు నిలిపివేశారు. దీంతో గడిచిన విద్యా సంవత్సరంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థినులు మార్చిలో పరీక్షలు రాసి వెళ్లిపోయారు. ఈ విద్యా సంవత్సరం నుంచి గురుకుల కళాశాలలో బాలికలకు ప్రవేశాలు కల్పించకపోవడంతో పోస్టుమెట్రిక్ వసతిగృహం మూతపడింది. దీంతో లక్షలు వ్యయంతో నిర్మించిన భవనం నిరుపయోగమైంది.

అధిక రక్తస్రావంతోనే గర్భిణి మృతి

▸▸ డీఎంహెచ్‌వో జమాల్ బాషా

గూడెంకొత్తవీధి, ఆగస్టు 10: మండలంలోని రింతాడ గ్రామానికి చెందిన గర్భిణి పరిమళ అధిక రక్తస్రావం వల్ల మృతి చెందినట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా తెలిపారు. 'సకాలంలో వైద్యం అందక తల్లి, బిడ్డ మృతి' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీనిపై విచారణ చేపట్టాలని గూడెంకొత్తవీధి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వినయ్‌కుమార్‌ను ఆదేశించగా, అతను గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారని చెప్పారు. గర్భిణికి చింతపల్లిలో నిర్వహించిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఆధారంగా నవంబరు 19వ తేదీన ప్రసవ సమయంగా వైద్యులు నిర్ధారించారని, అయితే గురువారం కడుపునొప్పి రావడంతో జీకే వీధి వైద్యాధికారి సూచన మేరకు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లారని, అక్కడ వైద్యులు గర్భిణిని పరీక్షించి ఎంటీ పార్టం హెమరేజ్‌గా గుర్తించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. అంబులెన్సులో నర్సీపట్నం తరలిస్తుండగా అధిక రక్తస్రావం జరిగిందన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో స్కానింగ్ చేయగా కడుపులో శిశువు మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారన్నారు. రక్తస్రావం అధికం కావడంతో వైద్యులు రక్తం పెట్టి రాత్రి ప్రసవం చేశారన్నారు. గర్భిణికి ప్రసవం ముందు, తరువాత కూడా అధిక రక్తస్రావం జరగడంతో నర్సీపట్నం వైద్యుల సూచన మేరకు కేజీహెచ్‌కి వెళ్లారని, అక్కడికి వెళ్లిన వెంటనే మృతి చెందిందని డీఎంహెచ్‌వో వివరించారు.

'నల్లరాయి క్వారీకి అధికారుల దన్ను'

పాడేరు రూరల్, ఆగస్టు 10: హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీ యజమానులకు మైనింగ్ అధికారులు కొమ్ముకాస్తున్నారని సీపీఐ నేత అమర్ ఆరోపించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ క్వారీ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ మేరకు సర్వేయర్, వీఆర్‌వో విచారణ చేపట్టగా నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. అయినప్పటికీ క్వారీని నిలిపి వేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. క్వారీతో కొట్నాపల్లి, కొత్తవలస, సువ్వాపాడు, చక్రిపుట్టు, మారెల, పందిమెట్ట, మత్స్యపురం, పెదగరువు తదితర గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నల్లరాయి క్వారీని నిలిపివేసి గిరిజనులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

డుంబ్రిగుడ, ఆగస్టు 10: మండల కేంద్రంలోని సంతవలస పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కె.రఘునాథ్ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటంలో యూటీఎఫ్ అగ్రగామిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రతినిధులు ఎస్.బాలక్రిష్ణ, లింగన్న, శ్యామ్‌సుందర్, కన్నయ్య మోహనరావు, బాబూరావు పాల్గొన్నారు.

కాశీపట్నంలో...

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద శనివారం యూటీఎఫ్ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు జై.వై.దొర మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల నాయకులు శెట్టి రాంబాబు, బి.సింహాచలం, ఎన్.మల్లేశ్వరరావు, ఎస్.పరమేశ్వరరావు, జి.నారాయణరావు, గంగరాజు, స్వామినాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

చర్యలబందలో వైద్య శిబిరం



గిరిజనులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న వైద్య సిబ్బంది

జి.మాడుగుల, ఆగస్టు 10: లువ్వాసింగి పంచాయతీ పరిధిలోని చర్యలబంద గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 52 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేశారు. వీరిలో తొమ్మిది మంది జ్వర పీడితులకు మందులు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వైద్యాధికారి రవిచంద్రశేఖర్ గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రకాశ్, బాలు పాల్గొన్నారు.

బూసిపుట్టులో సమస్యల రాజ్యం

కనీస సదుపాయాలు కరువు.. కానరాని సీసీ రోడ్లు, కాల్వలు

గ్రామాల్లో గిరిజనుల అగచాట్లు.. పట్టించుకోని అధికారులు



సీసీ రోడ్ల సౌకర్యం లేని పంచాయతీలోని ఓ గ్రామ మట్టి మార్గం

ముంచంగిపుట్టు, ఆగస్టు 10: మండలంలోని మారుమూల బూసిపుట్టు పంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిని కలుపుతూ తమ గ్రామాలకు సీసీ రోడ్లు నిర్మించాలని పలుమార్లు వినతులు అందించినా ఫలితం కానరావడం లేదని సంతవీధి, సుల్తాన్‌పుట్టు, బొర్రపనస, కమ్మరగొయ్యి తదితర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో చినుకుపడితే రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షా కాలంలో ఇంటి నుంచి బయట అడుగు పెట్టలేని దుస్థితి దాపురిస్తుందని, దానితోడు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందు నుంచే పారుతోందని వాపోయారు. ఎక్కడబడితే అక్కడ మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు అధికమై వ్యాధుల బారిన పడుతున్నట్టు వారు చెప్పారు. ప్రధాన రహదారిని కలుపుతూ సీసీ రోడ్లు లేక వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వర్షా కాలంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారుతున్నదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బూసిపుట్టు పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన శిథిలం.. పొంచివున్న ప్రమాదం!

▸▸ గోమంగి మార్గంలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం



మట్టి కోతతో శిథిల స్థితిలో ఉన్న మర్రిపుట్టు వంతెన

పెదబయలు, ఆగస్టు 10: గోమంగి పంచాయతీలోని మర్రిపుట్టు వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన కింద మట్టి పూర్తిగా కోతకు గురికావడంతో పాటు రాళ్లు కూడా చెదిరిపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితిలో ఉంది. దీంతో అటువైపుగా ప్రయాణించే వాహన చోదకులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన కింద భాగంలో గల రాళ్లు, మట్టి వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు ఉన్న మట్టి, రాళ్లు కాస్త కూడా కిందకు జారిపోయాయి. దీంతో వంతెన మరింత ప్రమాదభరితంగా తయారైంది.

గోమంగి పంచాయతీ రిధిలోని పలు గ్రామాలతో పాటు గుల్లెలు, బొంగరం, లింగేటి, ఇంజరి, గిన్నెలకోట పంచాయితీలకు చేరుకోవాలంటే ఈ మార్గామే ప్రధానం. అలాగే పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ప్రజలు జి.మాడుగుల మండలానికి వెళ్లడానికి కూడా ఇదే ఆధారం. ఈ వంతెన మీదుగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం వంతెన శిథిలం కావడంతో వారంతా బిక్కుబిక్కుమంటూ ప్రయాణిసుతన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ వంతెన మరమ్మతు చేయాలని వారు వేడుకుంటున్నారు.

స్మార్ట్ మీటర్లు

... 5వ పేజీ తరువాయి

మొత్తంలో విద్యుత్ బిల్లు వచ్చేవారికి స్మార్ట్ మీటర్లు ఇవ్వరు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 15 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా వారిలో ఐదు లక్షల మందికి వీటిని అమరుస్తారని, మిగిలిన వారికి అవసరం ఉండదని ఈపీడీసీఎల్ అధికార వర్గాలు తెలిపాయి.

ఎందుకీ స్మార్ట్ మీటరు?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లను అమరుస్తున్నారు. వీటి వల్ల ఎక్కడ?, ఎంత? విద్యుత్ వినియోగిస్తున్నదీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. అదేవిధంగా ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ సరఫరా ఉందా? లేదా? ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న లోడ్ వంటి అంశాలన్నీ పంపిణీ సంస్థ అధికారులు కార్యాలయం నుంచి తెలుసుకోవచ్చు. స్మార్ట్ మీటరు ఏర్పాటు చేసుకున్న వారు దానిని మొబైల్‌లాగే ముందుగా డబ్బులు కట్టి రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెలా పది నుంచి పదిహేను రోజుల వ్యవధిలో బిల్లులు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక...అలా కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తున్నదో సగటున అంచనా వేసి, ఆ మొత్తం ముందుగానే చెల్లించి మీటరును రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ఆ మొత్తం ఎంత అనేది వినియోగం బట్టి మారుతుంది. ఒక్కోసారి అధికంగా విద్యుత్‌ను ఉపయోగిస్తే రీచార్జి చేసుకున్న మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయాల్లో వినియోగదారుల మొబైల్‌కు సమాచారం పంపిస్తారు. వినియోగించిన విద్యుత్, రీచార్జి చేసిన మొత్తం, ఇంకా ఎంత రీచార్జి చేసుకోవాలో తెలియజేస్తారు. దీనివల్ల విద్యుత్ పంపిణీ సంస్థలకు 100 శాతం బిల్లింగ్, పేమెంట్ జరుగుతుంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల నుంచి బయటపడడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూళ్లు

ప్రస్తుతం విద్యుత్ పంపిణీ సంస్థలకు వాణిజ్య, గృహ వినియోగదారుల నుంచి బిల్లుల వసూళ్లలో పెద్దగా సమస్యలు లేవు. 98 శాతం వసూలైపోతున్నాయి. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలే బిల్లులు ఏళ్ల తరబడి కట్టడం లేదు. బకాయిలు కోట్ల రూపాయల్లో ఉన్నా పంపిణీ సంస్థలు చర్యలు చేపట్టలేకపోతున్నాయి. ఇతర వినియోగదారుల్లా సరఫరా నిలిపివేయడం, నోటీసులు ఇవ్వడం వంటివి చేయలేకపోతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటీ పార్కులో ఇన్నోవేషన్ సొసైటీ కలసి రూ.10 కోట్ల మొత్తం చెల్లించాల్సి ఉంది. అయినా వాటికి సరఫరా ఇస్తూనే ఉన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే ఇలాంటి బకాయిల బెడద ఉండదు. ఆయా సంస్థలు కూడా ముందుగానే వారి మీటర్లను రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రతి కార్యాలయం అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటుంది. అందుకే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యాంబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రసవ వేదన ఇంకెన్నాళ్లు..?

... 5వ పేజీ తరువాయి

అంబులెన్స్‌లో గంటన్నర ప్రయాణించాల్సిన పరిస్థితిఏర్పడుతుంది.

ఆపరేషన్లు ప్రారంభించిన ఆరు నెలలకే బంద్

స్థానిక ఏరియా ఆస్పత్రిలో 2023 ఫిబ్రవరి 12వ తేదీన ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృషి ఫలితంగా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ టి. నరసింగరావు సిజేరియన్ ఆపరేషన్లు ప్రారంభించారు. నాటి నుంచి ఆరు నెలల పాటు ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయి. అనంతరం గైనికాలజిస్టులు, అనస్థీషియా వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల సిజేరియన్ ఆపరేషన్లు నిలిచిపోయాయి. రెండు నెలల క్రితం వరకు కేవలం ఒక గైనికాలజిస్టు మాత్రమే అందుబాటులో ఉండడం, ఆమె సెలవు పెడితే గర్భిణులకు వైద్య పరీక్షలు నిలిచిపోతున్నాయి. దీంతో 'ఆంధ్రజ్యోతి' వరస కథనాలు ప్రచురించడంతో పాడేరు ఏరియా ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న గైనికాలజిస్టు ప్రవీణను తిరిగి చింతపల్లికి పంపించారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో ఇద్దరు గైనికాలజిస్టులు అందుబాటులో ఉన్నారు. అయితే అనస్థీషియా వైద్యులు ఇద్దరిలో ఒకరు పూర్తిగా రావడం లేదు. మరో కాంట్రాక్టు వైద్యాధికారి గౌతమ్ దీర్ఘకాల సెలవులో ఉన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'సకాలంలో వైద్యం అందక తల్లి,బిడ్డ మృతి' శీర్షికన ప్రచురితమైన వార్తపై హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శిరి స్పందించారు. ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు నిలిచిపోవడంపై ఆరా తీశారు. దీంతో దీర్ఘకాల సెలవులో ఉన్న గౌతంని డీసీహెచ్ఎస్ కృష్ణారావు, సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు ఆస్పత్రికి పిలిపించారు. అనస్థీషియా గౌతం వారానికి రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటానని, మిగిలిన రోజులు సెలవు కావాలని కోరారు. దీనికి డీసీహెచ్ఎస్, సూపరింటెండెంట్ అంగీకరించ లేదు. దీంతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయారు.